www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 27 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-135 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



# పాత బస్తీలో భద్రత మరింత పటిష్టం

- పాతబస్తీలో భద్రత మరింత పటిష్టం
- ప్రార్థనల సందర్బంగా నిఘా పెంపు
- అల్లర్లు జరక్కుండా ముందస్తు చర్యలు

ఇటీవలి వరుస ఘటనలు, శుక్రవారం ప్రార్థనల నేపథ్యంలో పాతబస్తీలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో పాటు, సాధారణ పోలీసులను కూడా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చేసుకోకుండా ఉండేందుకు టాస్క్ ఫోర్స్ పోలీసులను, సమస్యాత్మక ప్రాంతాల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ ఫోర్స్‌ను ఉంచారు. ఫలక్‌నుమా, చంద్రాయన్ గుట్ట అలియాబాద్, శాలిబండ, మొగల్‌పురా, హుస్సేన్ అలం, పట్టార్ గడ్డి, మదీనా దారుషిఫా, డబ్బీర్పుర, మురిగి, చౌక్ మిరాల మండి తదితర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోపక్క అందరూ శాంతియుతంగా నమాజ్ చేసుకోవాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సూచించారు.

**హైదరాబాద్, అగస్టు 26 (సమ సమాజం):** పాతబస్తీలో భారీ భద్రత, ముస్లింల ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో భారీ నిఘా ఏర్పాటు చేశారు. చార్మినార్ పరిసర ప్రాంతాలు, పాతబస్తీలో భారీగా పోలీసులు మోహరించారు. చార్మినార్ పరిసర ప్రాంతాల్లో ఉన్న దుకాణాలను గురువారం రాత్రి ఏడు గంటలకే మూసేయించారు. పోలీసులు గస్తీ వాహనాలతో పహారా కాస్తున్నారు. చార్మినార్ పరిసర ప్రాంతాలకు ఎవ్వరినీ అనుమతించడంలేదు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. చార్మినార్ నాలుగు దిక్కులా.. బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఎంఐఎం డిమాండ్ మేరకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై పిడీ యాక్ట్ పెట్టడంతో పాటు, రాజాసింగ్‌ను అరెస్ట్ చేసి.. జైలుకు తరలించారని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ పేర్కొన్నారు. జుమ్మా సందర్బంగా చేసే నమాజ్‌ను శాంతియుతంగా చేసుకోవాలని అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలకు సూచించారు. నమాజ్ తర్వాత అందరూ ప్రశాంతంగా వెళ్లిపోవాలన్నారు. ఎక్కడా ఎవరికి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. ఎలాంటి ఘటనలకు పాల్పడినా.. హైదరాబాద్ పేరు చెడిపోతు ందన్నారు. భాగ్యనగరంలో అల్లర్లు సృష్టిస్తున్న మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని.. విశ్వహిందూ పరిషత్ కోరింది. డీజీపీ మహేందర్ రెడ్డిని కలిసి

2వ

# ప్రజల ఓట్లను తాకట్టుపెట్టడం వల్లే 22 వేల కోట్ల కాంట్రాక్టు

**కోమటిరెడ్డి బ్రదర్స్‌పై మంత్రి జగదీశ్వర్ రెడ్డి మండిపాటు**



**నల్లగొండ, అగస్టు 26 (సమ సమాజం):** నమ్మిన పార్టీని, నమ్ముకున్న ప్రజలను అమ్ముకోవడం కోమటిరెడ్డి బ్రదర్స్‌కు వెన్నతో పెట్టిన విద్య అని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోను వీరు మోసాలకు పాల్పడ్డారన్నారు. టీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా జిల్లాలోని నాంపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆయన అనుచరులు టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. కడపకు నీటిని తరలిస్తుంటే వైఎస్‌కు వంత పాడారని గుర్తు చేశారు. రాజీనామా చేస్తే ఉప ఎన్నికలే వస్తాయి. అభివృద్ధి కోసమైతే మీ సహచరులు ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టుల కోసమే రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని విమర్శించారు. మునుగోడు నియోజకవర్గ ప్రజల ఓట్లను తాకట్టుపెట్టడం వల్ల రూ. 22,000 కోట్ల కాంట్రాక్టు వచ్చిందన్నారు. బీజేపీకి ఓటేస్తే మోటర్లకు మీటర్లు పెడుతారన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్ర నాయక్, నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మునుగోడు ఎంపీపీ స్వామి, జడ్పీటీసీ ఏ.వీ రెడ్డి, ఎంపీపీ శ్వేతా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ బిజెపి సభకు హైకోర్టు అనుమతి

- సభకు సహకరించాలని కమిషనర్‌కు ఆదేశాలు
- నేడు భద్రకాళి వద్ద ముగియనున్న బండి యాత్ర
- సాయంత్రం ఆర్ట్స్ కాలేజీలో భారీ బహిరంగ సభ
- హాజరవుతున్న బిజెపి అధ్యక్షుడు జెపినడ్డా
- హైకోర్టు తీర్పును స్వాగతించిన బండి
- కోర్టులపై నమ్మకం ఉందని వెల్లడి
- కెసిఆర్ అవినీతిపై చర్చజరక్కుండా సభకు అడ్డంకులు
- మీడియా సమావేశంలో సంజయ్ వ్యాఖ్యలు



**హైదరాబాద్, అగస్టు 26 (సమ సమాజం):** వరంగల్ బీజేపీ సభకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన మూడో విడత ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సందర్భంగా హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ లో శనివారం భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు బీజేపీ సిద్ధమైంది. అయితే సభకు పోలీసుల పర్మిషన్ లేదన్న కారణంతో కాలేజీ ప్రిన్సిపల్ అనుమతి రద్దు చేశారు. దీంతో బీజేపీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. మీటింగ్‌కు పర్మిషన్ ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలంటూ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. బీజేపీ లంచ్ మోషన్ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం ఇరు పక్షాల వాదనలు విన్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీలో ఎగ్జామ్స్ ఉన్నందునే ప్రిన్సిపల్ సభ అనుమతి రద్దు చేశారని ఏజీ న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. కళాశాలకు

2వ

# ఉచిత వాగ్దానాలపై సుప్రీంలో చర్చ

**చివరిరోజు కీలక కేసులపై చర్చించిన జస్టిస్ రమణ**



**న్యూఢిల్లీ, అగస్టు 26 (సమ సమాజం):** రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత వాగ్దానాల అంశం గురించి శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ అంశాన్ని నిపుణుల కమిటీ పరిశీలించాలని సీజేఐ ఎన్వీ రమణ తెలిపారు. అఖిల పక్ష భేటీలో దీన్ని చర్చించాలని ఆయన అన్నారు. అయితే ఇవాళ తొలిసారి జరిగిన లైవ్ స్ట్రీమిగ్‌లో ఈ కేసును విచారించారు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలు ఇస్తున్నాయని, ఆ పార్టీల గుర్తింపు ఎత్తివేయాలని దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ప్రజాస్వామ్యంలో అసలైన శక్తి ఓటరు వద్దే ఉంటుందని, వాళ్లే పార్టీలను, అభ్యర్థులను ఎంపిక చేస్తారని సీజే రమణ అన్నారు. అయితే ఈ అంశాన్ని పరిశీలించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సీజే అన్నారు. ఈ అంశంపై ఆల్ పార్టీ మీటింగ్ కూడా ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు సీజే గుర్తు చేశారు. తాము చేస్తున్న వాగ్దానాలు ఉచితాలు కాదు అని, అవి సంక్షేమ పథకాలు అని అనేక రాజకీయ పార్టీలు కోర్టులో వాదించాయి. అయితే ఇలాంటి కేసుకు సంబంధించిన 2013 నాటి తీర్పును పరిశీలించనున్నట్లు కోర్టు తెలిపింది. ఉచితాల అంశంలోని సంక్లిష్టత నేపథ్యంలో కేసును త్రిసభ్య ధర్మాసనానికి రిఫర్ చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

# బండి సంజయ్ పాదయాత్రలో తీవ్ర ఉద్రిక్తత

- కూనూరు వద్ద యాత్రను అడ్డుకున్న టిఆర్ఎస్
- బండికి వ్యతిరేకంగా నినాదాలు
- ఇరు పార్టీల కార్యకర్తల మధ్య మళ్లీ తోపులాట



**జనగామ, అగస్టు 26 (సమ సమాజం):** బండి సంజయ్ పాదయాత్రలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మరోమారుఆయన పర్యటనను టిఆర్ఎస్ అడ్డుకుంది. ఇప్పటికే పాదయాత్రను రద్దుచేయాలన్న పోలీసుల తీరుపై మైకోర్టు విచారించనుండగా...జనగామ జిల్లా జఫర్ గడ్ మండలం కూనూర్ దగ్గర టీఆర్ఎస్ కార్యకర్తలు పాదయాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. సంజయ్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో బీజేపీ కార్యకర్తలు, పోలీసులు, టీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ప్రశాంతంగా పాదయాత్ర చేస్తుంటే..టీఆర్ఎస్ రెచ్చగొట్టే చర్యలకు దిగుతుందని బీజేపీ నేతలు మండిపడ్డారు . మరోవైపు సంజయ్ పాదయాత్రకు భారీగా భద్రత ఏర్పాటు చేశారు పోలీసులు. కూనూర్ దగ్గర లంచ్ తర్వాత గర్మెపల్లి, నాగపురం వరకు పాదయాత్ర చేస్తారు. హైకోర్టు అనుమతితో మూడు రోజుల బ్రేక్ తర్వాత బండి సంజయ్ పాదయాత్ర కొనసాగుతోంది. రేపు భద్రకాళీ అమ్మవారి ఆలయానికి చేరుకుంటుంది. అమ్మవారి దర్శనం తర్వాత హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్లో జరిగే పాదయాత్ర ముగింపు సభలో సంజయ్ పాల్గొంటారు. మరో వైపు బండి సంజయ్ యాత్రపై సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ అప్పీల్ పై కాసేపట్లో హైకోర్టు విచారణ చేపట్టనుంది. అయితే హైకోర్టు ఆదేశాలతో బండి సంజయ్ శుక్రవారం నుంచి తన పాదయాత్రను పున: ప్రారంభించారు. జాఫర్ గఢ్ మండలం పాంనూర్ నుంచి పాదయాత్రను కొనసాగించారు. బండి సంజయ్ పాదయాత్ర ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తుండడంతో పాదయాత్ర నిలిపేయాలని పోలీసులు ఆయనకు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో బండి సంజయ్ కోర్టును ఆశ్రయించడంతో పాదయాత్రకు లైన్ క్లియర్ అయ్యింది. దీంతో మూడు రోజుల పాటు నిలిచిపోయిన పాదయాత్ర శుక్రవారం నుంచి పున:ప్రారంభ మయ్యింది. శనివారం భద్రకాళీ ఆలయం వరకు కొనసాగుతోంది. అనంతరం పాదయాత్ర ముగింపు సభ ఉంటుంది. హన్మకొండ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సభ నిర్వహణకు అనుమతి నిరాకరించారు. పోలీసుల నుంచి ఎలాంటి సమాచారం లేనందున అనుమతి రద్దు చేస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు. దీనిపై కూడా బీజేపీ నాయకులు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ పార్టీకి మరో గట్టి షాక్

- సీనియర్ నేత గులాంనబీ పార్టీకి గుడ్‌బై
- కాంగ్రెస్‌లో సీనియర్లకు విలువ లేదంటూ ఘాటు లేఖ
- రాహుల్ అపరివక్వ రాజకీయాలే కారణమని వ్యాఖ్య
- పార్టీతో 50 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటన



**న్యూఢిల్లీ, అగస్టు 26 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీకి మరో గట్టి షాక్ తగిలింది. పార్టీ సీనియర్ నేత గులాంనబీ ఆజాద్.. కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు శుక్రవరాం ఆయన ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. జమ్మూకశ్మీర్ మాజీ సీఎంగా, కేంద్రమంత్రిగా, వవిధ రాష్ట్రాలకు పర్యవేక్షకుడిగా ఆయన పనిచేశారు. పార్టీకి చెందిన అన్ని పోస్టుల నుంచి తప్పుకుంటున్నట్లు ఆజాద్ వెల్లడించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీకి అయిదు పేజీల లేఖను ఆయన రాశారు. పార్టీలో సంప్రదింపుల పక్రియ లేకుండాపోయిందని ఆజాద్ ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ వైస్ ప్రెసిడెంట్ అయ్యాక పార్టీ నాశనమైనట్లు ఆయన తెలిపారు. ఆజాద్ రాజీనామాతో కాంగ్రెస్ పార్టీకి భారీ జలక్ తగిలినట్లు అయ్యింది. ఇటీవల మరో సీనియర్ నేత ఆనంద్ శర్మ కూడా ఆ పార్టీకి చెందిన కీలక పోస్టుకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఏఐసీసీ కోటరీలో పట్టుదల, సత్తా లోపించిందన్నారు. ఈ నేపథ్యంలో చాలా బాధాకర రీతిలో 50 ఏళ్లు సేవ చేసిన పార్టీ నుంచి తప్పుకుంటున్నట్లు ఆజాద్ తన లేఖలో తెలిపారు. రాహుల్ గాంధీ వైఖరిపై ఆజాద్ తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్ అపరిపక్వత పార్టీలో ఉన్న సంప్రదింపుల వ్యవస్థను నాశనం చేస్తోందని పేర్కొన్నారు. చాన్నాళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో కొందరు సీనియర్ నేతలు అధిష్టానంపై గుర్రుగా ఉన్న విషయం తెలిసిందే. జీ-23 తిరుగుబాటుదారుల్లో గులాంనబీ ఆజాద్ కీలక వ్యక్తిగా నిలిచారు. కాంగ్రెస్ తో అర్ధశతాబ్ద కాలంగా సంబంధాలున్నాయని గులాంనబీ ఆజాద్ అన్నారు. అయినా ప్రసత్తుత పరిమణామాల నేపథ్యంలో కాంగ్రెస్ తో సంబంధం తెంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు రాజీనామా లేఖలో పేర్కొన్నారు. పార్టీలో సుదీర్ఘకాలం పాటు సేవలందించిన సీనియర్ నేతలను పక్కన పెట్టడంపై తీవ్ర మనస్థాపం చెందానని తెలిపారు. రాహుల్ గాంధీ తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.రాహుల్ గాంధీకి రాజకీయ అవగాహన లేదన్నారు. కాంగ్రెస్ రాజకీయ పలుకుబడి క్షీణించడం.. పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలలో పేలవమైన పనితీరుకు రాహుల్ గాంధీ అపరిపక్వతే కారణమని ఆరోపించారు. ప్రభుత్వ ఆర్డినెన్స్‌ను మీడియా ముఖంగా అందరూ చూస్తుండగానే చించివేయడం రాహుల్ అపరిపక్వ తకు నిదర్శనమన్నారు. రాహుల్ గాంధీది.. చిన్నపిల్లల మనస్తత్వం.. సీనియర్లు అందరిని రాహుల్ పక్కన పెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హోదా లేనప్పటికీ అన్నింటిలో రాహుల్ జోక్యం

2వ

# టీచర్ అవమానించాడని విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్, అగస్టు 26 (సమ సమాజం):** తోటి విద్యార్థుల ముందు టీచర్ అవమానించారని ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన హయత్ నగర్‌లో చోటుచేసుకుంది. తమ కూతురి బలవన్మరణానికి టీచరే కారణమంటూ విద్యార్థిని కుటుంబసభ్యులు స్కూల్ ముందు ఆందోళనకు దిగారు. హయత్ నగర్‌కు చెందిన అక్షయ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. హోం వర్క్ చేయలేదని అక్షయను టీచర్ తరగతి గదిలో మోకాళ్లపై నిలుచోబెట్టారు. తనను తోటి విద్యార్థుల ముందు అవమానించారని.. అక్షయ సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చి ఫ్యాన్‌కి ఉరేసుకుని అత్మహత్య చేసుకుంది. ఇటు విద్యార్థిని కుటుంబ సభ్యులు, బంధువులు స్కూల్ ముందు ఆందోళనకు దిగడంతో పోలీసులు మోహరించారు.

## సంపాదకీయం

# ధర్మదక్షతకు నిలువెత్తు సాక్ష్యం..మన రమణ !

భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్.వి.రమణ నెలకొల్పిన విలువలు అందరి ప్రవంసలు అందు కున్నాయి. సంకల్పం ఉంటే ఏదైనా సాధించ వచ్చని నిరూపించిన రమణ సుప్రీం తీర్పుల్లో ఎన్నో కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. సంకల్పం , పట్టుదల, చిత్తశుద్ధి ఉంటే మార్పులు సాధ్యమేని నిరూపించారు. ఏడాదికి పైగా మాత్రమే పదవిలో కొనసాగిన జస్టిస్ రమణ ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. న్యాయవ్యవస్థను భారతీయీకరణ చేయాలన్న వాదనను జస్టిస్ రమణ ప్రతి వేదికపై వినిపిస్తూ వచ్చారు. ప్రజలు, న్యాయవ్యవస్థ మధ్య బంధాన్ని బలోపేతం చేయాలన్నది ఆయన ఉద్దేశం. భారతీయ న్యాయ వ్యవస్థలో నియమ నిబంధనలను సంస్కరించి, మౌలికవసతులను మెరుగుపరిచి, భాషాపరమైన అడ్డంకుల తో సహా అన్ని రకాల అవాంతరాలను తొలగించి, సామాన్యుడు ధైర్యంగా కోర్టును ఆశ్రయించే వ్యవస్థను తీర్చిదిద్దాలని ఆయన కలలు కన్నారు. జస్టిస్ రమణ ఏకవ్యక్తిస్వామ్యంలా కాకుండా.. సహచర న్యాయ మూర్తులతో కలిసి బృందంగా పనిచేయడానికి ప్రాధాన్యం ఇచ్చారు. 48వ సీజేఐగా గత ఏడాది ఏప్రిల్ 24న బాధ్యతలు చేపట్టిన ఆయన.. 16 నెలల పదవీకాలంలో జనహితమే ధ్యేయంగా పలు కీలక తీర్పులు, ఉత్తర్వులు వెలువరించారు. న్యాయ వ్యవస్థలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించారు. ప్రజలకు న్యాయం వేగంగా అందేలా న్యాయ మూర్తుల నియామకాలను పెద్ద ఎత్తున చేపట్టారు. సీజేఐగా ఆయన పదవీకాలం శుక్రవారంతో ముగిసింది. అయితే ఉన్నది కొద్ది కాలమే అయినా చరిత్రలో నిలిచి పోయేలా తీర్పులను వెలువరించారు. చివరి రోజు కోర్టు ప్రొఓసీడింగ్స్ ప్రత్యక్షప్రసారానికి అనుమతించి మరో చరిత్ర సృష్టించారు. సంకల్ప బలం,చిత్తశుద్ధి ఉంటే ఏదైనా సాధించ వచ్చని నిరూపిం చారు. ఎలా ఆదర్శంగా ఉండాలో..ఎలా ఆదర్శంగా పనిచేయ వచ్చో కూడా తన తరవాతి తరానికి ఓ పాఠం నేర్పారు. భారత న్యాయ వ్యవస్థలో అత్యున్నత చీఫ్ జస్టిస్ పీఠాన్ని అధిరోహించిన రెండో తెలుగు వ్యక్తిగా ఆయన చరిత్ర పుటల్లో స్థానం పదిల పర్చుకున్నారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా ప్రజల అంచనాలను అందుకునేందుకు అహర్నిశలు శ్రమించారు. ప్రజలకు సత్వర న్యాయం అందాలన్న తపనతో పనిచేశారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్న తపన కనబర్చారు. న్యాయ వ్యవస్థను వేధిస్తున్న సమస్య లను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి అవసరమైన మార్గాలూ సూచించారు. తన పరిధిలోని అంశాలను వేగంగా పరిష్కరించి చూపి భావి సీజేఐలకు మార్గదర్శిగా నిలిచారు. కక్షిదారు లకు సకాలంలో న్యాయం అందకపోవడానికి, న్యాయ మూర్తులపై పనిభారం విపరీతంగా పెరిగిపోతుం డటానికి.. ఖాళీలు, మౌలికవసతుల కొరతే ప్రధాన కారణమని ఆయనకు ముందునుంచీ తెలుసు. అందుకే తాను సీజేఐగా బాధ్యతలు చేపట్టాక ఆ రెండు అంశాలపై బాగా దృష్టిసారించారు. వ్యవస్థను సంస్కరించేం దుకు నడుం బిగించారు. అంతకుముందు పనిచేసిన సీజేఐలతో పోలిస్తే జస్టిస్ రమణ సుప్రీంకోర్టు తలుపుల ను ప్రజలకు మరింత బార్లా తెరిచారు. ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా ప్రజల మనసులను తెలుసుకొనేందుకు ప్రయత్నించారు. తనకు వచ్చే ఉత్తరాలకు ఎప్పటికప్పుడు స్పందిస్తూ సర్వోన్నత న్యాయస్థానాన్ని సాధారణ ప్రజలకు చేరువ చేసేందుకు కృషిచేశారు. హక్కులు, రాజ్యాంగం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తే.. వారే ప్రజాస్వామ్యాన్ని కాపాడు కుంటారన్న నమ్మకంతో ప్రజాచైతన్యానికి ఆయన అధిక ప్రాధాన్యం ఇచ్చారు. న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షప్రసారం చేయడం, కోర్టుల్లో రోజువారీ విచారణలను పాత్రికేయులకు అందు బాటులో ఉంచడం కోసం ప్రత్యేక యాప్‌ను ఏర్పాటుచేయడం, కొత్తగా నిర్మించిన ఛాంబర్లను న్యాయవాదు లకు కేటాయించడం, సుప్రీంకోర్టు ఆడిటోరియాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు వాడుకునేందుకు అవకాశం కల్పించడం.. ఎన్నాళ్లనుంచో పెండింగులో ఉన్న ఈ పనులన్నీ జస్టిస్ రమణ చొరవ వల్లే ఫలించాయి. ఈ చర్యల ద్వారా వ్యవస్థను అందరికీ దగ్గర చేసే ప్రయత్నం చేశారు. రాజద్రోహ సెక్షన్‌ను ప్రభుత్వాలు సామాన్యులపై ఇష్టారీతిన ప్రయోగించకుండా గత మే నెలలో సర్వోన్నత న్యాయస్థానంలో మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయి. సెక్షన్ 124ఎని కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించేంతవరకూ దానికింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయమనం పాటించాలని అందులో ఆదేశించారు. దానికింద పెట్టిన కేసుల కారణంగా జైళ్లలో మగ్గుతున్న వారు బెయిలు కోసం న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని స్పష్టతనిచ్చారు. సెక్షన్ 124ఎ కింద పెండింగ్ లో ఉన్న విచారణలు, అప్పీళ్లు, నమోదుచేసిన అభియోగాలన్నింటినీ నిలిపివేయడం ద్వారా ప్రజల స్వేచ్ఛకు పట్టం కట్టారు.కోర్టులు బెయిలు మంజూరు చేసినా.. ఆ ఉత్తర్వులు అందలేదన్న కారణంతో ఖైదీల విడుదలలో తాత్సారాన్ని నివారించడానికి 'ఫాస్టర్' పేరుతో సురక్షితమైన ఎలక్ట్రానిక్ వ్యవస్థను అందుబాటు లోకి తెచ్చి దీర్ఘకాల సమస్యకు తెరదించారు.ఝార్ఖండ్‌లో ధన్‌బాద్ అదనపు జిల్లా జడ్జి ఉత్తమ్ ఆనంద్‌ను పట్టపగలు ఆటోతో ఢీకొట్టి హత్య చేసిన ఘటనను సుమోటోగా తీసుకొని సీబీఐ దర్యాప్తునకు సీజేఐ జస్టిస్ రమణ ఆదేశించారు. ఆ దారుణానికి పాల్పడిన వారికి ఏడాది కంటే తక్కువ సమయంలోనే శిక్ష ఖరారయ్యే లా చేశారు. తద్వారా న్యాయవ్యవస్థ లోని వ్యక్తుల్లో ధైర్యం నింపారు.శివసేన చీలిక కేసును రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించి.. న్యాయం చేయడంలో పొరపాట్లను పరిహరించేందుకు ప్రయత్నించారు. కరోనా సమయంలో జస్టిస్ రమణ ఓ కేసును సుమోటోగా తీసుకొని ఆక్సిజన్ సరఫరా, టీకా ధరల విషయంలో జోక్యం చేసుకున్నారు. ఫలితంగా ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకొని 18 ఏళ్ల వయసు దాటిన వారందరికీ ఉచిత వ్యాక్సిన్‌ను ప్రకటించాల్సి వచ్చింది. ఇకపోతే దాదాపు 12 ఏళ్లుగా సుప్రీంలో నలుగుతు న్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో పదవీ విరమణకు ముందు తీర్పుని ఇచ్చి వారికి న్యాయం దక్కేలా చేశారు. ఇలా గత ఏడాది కాలంలో అనేక సంస్కరణలతో న్యాయవ్యవస్థను తీర్చిదిద్దారు. మంచి సంప్రదా యాలను నెలకొల్పారు. ఆయన నెలకొల్పిన సంప్రదాయాలు ఇక తరవాతి తరం ఎంత వేగంగా తీసుకుని వెళితే అంతగా దేశ ప్రజలకు మేలు కలుగుతుంది. న్యాయం సతవరంగా అందుతుంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# పాత బస్తీలో భద్రత మరింత పటిష్టం

(మొదటి పేజీ తరువాయి..)పాతనగరం పరిస్థితిని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర బృందసభ్యులు వివరించారు. అధికార దాహం కోసమే తెలంగాణ సర్కార్.. హిందూ వ్యతిరేక శక్తులను ప్రోత్సహిస్తూ హిందుత్వంపై విషం చిమ్మే పనిలో పూర్తిస్థాయిలో నిమగ్నమైందని ఆరోపించారు. మునావర్ ఫరూక్ అనే హిందూ ద్రోహిని ప్రోత్సహిస్తూ.. ఇటీవల అతడి కామెడీ షోకు పోలీసులు అనుమతి ఇచ్చి హిందువులను రెచ్చగొట్టారని పేర్కొన్నారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి.. భాగ్యనగరంలో హిందువులకు రక్షణ కల్పించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు, అరెస్ట్ నేపథ్యంలో పాతబస్తీలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రార్థనల సమయంలో అలర్ట్‌గా ఉండాలని పోలీసులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఓల్డ్ సిటీతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న మసీదుల వద్ద పోలీసులను మోహరించాలని సూచిం చారు. ర్యాలీలు, ధర్నాలకు ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. చార్మినార్, మక్కా మసీదు ఏరియాల్లో వేల మంది ప్రార్థనల్లో పాల్గొనే అవకాశం ఉన్నందున భద్రతను మరింత కట్టుదిట్టం చేసారు. తమ నివాసాలకు దగ్గర్లో ఉన్న మసీదుల్లోనే ప్రార్థనలు నిర్వహించుకోవాలని అనవసరంగా బయటకు రావొద్దంటూ ముస్లిం మత పెద్దలు విజ్ఞప్తి చేసారు.

# రాష్ట్రాన్ని పాలిస్తున్న ఎంఐఎం

### ఇటీవలి ఘటనలపై గవర్నర్‌కు విహెచ్‌పి ఫిర్యాదు



**హైదరాబాద్, అగస్టు 26 (సమ సమాజం):** రాష్ట్రాన్ని ఎంఐఎం పాలిస్తోందని వీహెచ్‌పీ, భాగ్యనగర్ గణెళిశ్ ఉత్సవ్ సమితి నేతలు ఆరోపించారు. శుక్రవారం రాజ్ భవన్ లో గవర్నర్ తమిళిసైని కలిసిన విశ్వహిందూ పరిషత్, భాగ్యనగర్ గణెళిష్ ఉత్సవ సమితి నేతలు... నగరంలో జరుగుతున్న పరిణామాలపై గవర్నర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టీఆర్ఎస్, ఎంఐఎం నేతలు కలిసి కావాలనే నగరంలో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. అమాయకులను చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రానికి ఉన్నది ఉన్నట్టుగా నివేదిక ఇవ్వాలని గవర్నర్ ను కోరామన్నారు. 4వేల మంది పోలీసులతో మునవార్ షో నిర్వహించడం అవసరమా అని ప్రశ్నించారు. వినాయక చవితి ప్రశాంతంగా జరగకుండా ఉండేందుకు కుట్ర జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# వరంగల్ బిజెపి సభకు హైకోర్టు అనుమతి


(మొదటి పేజీ తరువాయి..)ఒకటే ఎంట్రెన్స్ ఉందని, సభ వల్ల విద్యార్థులకు ఇబ్బందులు ఎదుర్కొంటారన్న కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం బీజేపీ సభకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సహకరించాలని వరంగల్ సిపిని ఆదేశించింది. గతంలోనే పర్మిషన్ కోరినప్పుడు ఎందుకు తిరస్కరించలేదని కూడా కోర్టు ప్రశ్నించింది. అలాగే ఇటీవలే సభలు జరగ్గా లేని ఆంక్షలు ఇప్పుడే ఎందుకు అని కూడా ప్రశ్నించింది. కోర్టు ఆదేశాల మేరకు బండి సంజయ్ మూడో విడత ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సభ హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ లో యధావిధిగా జరగనుంది. ఈ భారీ బహిరంగ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరుకానున్నారు. శనివారం వరంగల్లో బీజేపీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. బీజేపీ నిర్వహిస్తున్న సభకు వరంగల్ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. సభకు అనుమతి ఇవ్వాలని బీజేపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు.బండి సంజయ్ చేపట్టిన మూడో విడత ప్రజా సంగ్రామ పాదయాత్ర ఈ నెల 27న వరంగల్‌లో ముగియనుంది. ఈ సందర్భంగా వరంగల్‌లో ఆ రోజు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. మరోవైపు వరంగల్ కమిషనరేట్ పరిధిలో నగర పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఆంక్షలు విధించారు. బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలపై నిషేధం విధించారు. నగరంలో శుక్రవారం నుంచి 30 సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తూ తరుణ్ జోషి ఉత్తర్వులిచ్చారు. శాంతి భద్రతల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. పోలీసు ఆంక్షలు ఈ నెల 31 వరకు అమల్లోఉంటాయి. ఉత్తర్వులు ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. బీజేపీ హైకోర్టు నుంచి సభకు



పర్మిషన్ తెచ్చుకున్న సమయంలో పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఆంక్షలు విధించడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉంటే ప్రజా సంగ్రామ పాదయాత్ర మూడో విడత ముగింపు సభకు అనుమతినిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్ స్వాగతించారు. చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవిస్తామని చెప్పారు. కోర్టును తప్పుదారి పట్టించే విధంగా ప్రభుత్వం వ్యవహరించిందని బండి మండిపడ్డారు. సభ కోసం ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ ను ముందే బుక్ చేసుకున్నా, పై నుంచి వచ్చిన ఒత్తిడి వల్ల ప్రిన్సిపల్ అనుమతి రద్దు చేస్తామని చెప్పారని అన్నారు. సభ ఏర్పాట్లు 90 శాతం పూర్తయినట్లు చెప్పిన సంజయ్.. తన పాద యాత్ర సాయంత్రానికి భద్రకాళి టెంపుల్ కు చేరుకుంటుందని చెప్పారు. జేపీ నడ్డాతో కలిసి అమ్మవారి దర్శనం చేసుకుని సభాస్థలికి వెళ్తామని ప్రకటించారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనే సాకుతో పోలీసులు ఆంక్షలు విధించారని బండి సంజయ్ మండిపడ్డారు. బహిరంగ సభకు ప్రజలు తండోపతండాలుగా తరలివస్తారని.. సీఎం కేసీఆర్ తమ సభను చూడాలని సూచించారు. నిర్బంధాలకు వ్యతిరేకంగా కార్యకర్తలు తరలివస్తున్నారని వెల్లడించారు. పాదయాత్రలో పోలీసులు జరిపిన లాఠీఛార్జ్‌లో ముగ్గురు కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయని.. వారు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం ప్రారంభమైందన్నారు. సభలో సిఎం కెసిఆర్ అవినీతి, కవిత లిక్కర్ కుంభకోణంపై చర్చ జరుగుతుందన్న భయం కెసిఆర్‌కు పట్టుకుందన్నారు. కోర్టులపై తమకు విశ్వాసం ఉందని బండి సంజయ్ తెలిపారు. హైకోర్టు అనుమతి ఇచ్చింది కాబట్టే పాదయాత్ర మళ్లీ ప్రారంభించామన్నారు. కేసులు పెట్టినా, లాఠీఛార్జ్ చేసినా భరిస్తామన్న బండి సంజయ్.. యుద్ధంలో చివరికి ధర్మమే గెలుస్తుందన్నారు. సీఎం కుటుంబంపై ఉన్న ఆరోపణలు పక్కదోవ పట్టించేందుకే తమపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు.అనుమతి ఇచ్చిన ప్రభుత్వమే.. ఇప్పుడు అనుమతులు లేవంటోంది. అధికార యంత్రాంగాన్ని తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. కోర్టులపై మాకు విశ్వాసం ఉంది. హైకోర్టు అనుమతి ఇచ్చింది కాబట్టే పాదయాత్ర మళ్లీ ప్రారంభించాం. కేసులు పెట్టినా, లాఠీఛార్జ్ చేసినా భరిస్తాం. యుద్ధంలో ధర్మమే గెలుస్తుంది. సీఎం కుటుంబంపై ఉన్న ఆరోపణలు పక్కదోవ పట్టించేందుకే మాపై కేసులు పెడుతున్నారు. సీఎం తప్పనిసరిగా దీనిపై సమాధానం చెప్పాలని బండి అన్నారు.



# కాంగ్రెస్ పార్టీకి మరో గట్టి షాక్



(మొదటి పేజీ తరువాయి..) పెరిగిందన్నారు. అనుభవం లేని కొత్త కోటరీ పార్టీ వ్యవహారాలను నడపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు రాహుల్‌ను నిందిస్తూనే సోనియాగాంధీని ప్రశంసించారు. దురదృష్టవశాత్తూ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత కాంగ్రెస్ పతనం ప్రారంభమైందన్నారు. ముఖ్యంగా జనవరి 2013లో రాహుల్ ఉపాధ్యక్షుడిగా నియమించబడిన తర్వాత మొత్తం యంత్రాంగాన్ని ఆయన కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన చాలా విషయాల్లో సోనియాగాంధీ పాత్ర నామమాత్రమేనని ఆజాద్ అన్నారు. కీలక నిర్ణయాలు రాహుల్ గాంధీ లేదా ఆయన సెక్యూరిటీ గార్డులు, పీఏలు తీసుకొంటున్నారని తప్పుపట్టారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ రెండు లోక్‌సభ ఎన్నికల్లో అవమానకర రీతిలో ఓడిపోయిందన్నారు. పార్టీ కేవలం నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో మాత్రమే విజయం సాధించిందన్నారు. నేడు కాంగ్రెస్ కేవలం రెండు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉందని..మరో రెండు రాష్ట్రాల్లో సంకీర్ణ భాగస్వామిగా కొనసాగుతుందని ఆజాద్ పేర్కొన్నారు. యూపీఏ ప్రభుత్వ సంస్థాగత సమగ్రతను కూల్చివేసిన రిమోట్ కంట్రోల్ మోడల్ ఇప్పటికీ కాంగ్రెస్ అమలు చేస్తుందన్నారు. ఇక దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తన ప్రాభవాన్ని కోల్పోతున్న నేపథ్యంలో అందుకుగల కారణాలపై అధిష్ఠానాన్ని ప్రశ్నిస్తోన్న జీ 23 నేతల్లో గులాంనబీ ఆజాద్ ఒకరు. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి అనంతరం పార్టీ సంస్థాగత మార్పుపై ఆజాద్ తీవ్రంగా గళమెత్తారు.

# తెలంగాణపై పడ్డ గుజరాతీలు

### కేజ్రీవాల్‌తో కలిసి కవితను ఇరికించే యత్నం

### మండిపడ్డ మంత్రి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**కామారెడ్డి, అగస్టు 26 (సమ సమాజం):** తెలంగాణ ప్రజల కోసం కేంద్రాన్ని సీఎం కేసీఆర్ ప్రశ్నిస్తున్నారని.. కేసీఆర్ కు ప్రజలు ధైర్యం ఇవ్వాలని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి శ్రీరామ్ అంటూ వస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ఒకవేళ బీజేపీ అధికారం లోకి వస్తే రూ. 2 వేల ఫించన్ రూ. 500 తగ్గుతుందని.. అలాగే.. 24 గంటల కరెంటు ఉండదని, కళ్యాణలక్ష్మి ఇతర పథకాలు ఉండవన్నారు. కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడలో ఆయన మాట్లాడారు.. ప్రశ్నించే వారిపై ఈడీ కేసులు పెడుతున్నారని.. కేసీఆర్ లాగే ఢిల్లీ సీఎం క్రేజివాల్ కూడా దేశ అభివృద్ధిపై ప్రశ్నిస్తుంటే.. వారి పార్టీకి చెందిన వారిపై ఈడీ కేసులు పెడుతున్నారని విమర్శించారు. వారితో పాటు కవితను అందులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పార్టీలో చేరాలి లేకుంటే ఈడీ కేసులు పెడుతామని బెదిరిస్తున్నారని తెలిపారు. గుజరాతీలైన నరేంద్రమోడీ, అమిత్ షా ఇప్పుడు తెలంగాణ మీద పడ్డారని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇతర పార్టీల సీఎంలను దింపి వారి ఎమ్మెల్యేలను బీజేపీలో చేర్చుకోవడం..వారికి నచ్చిన వారికి ముఖ్యమంత్రులుగా చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళుతున్న క్రమంలో పువ్వు, చేయి గుర్తులు వస్తే ఆగమవుతామన్నారు. 2010లో 2జీ స్పెక్టం÷-ర లక్ష 50 వేలకు కేంద్రం వేలం వేస్తే లోలోపల కుమ్మక్కై.. ఈ సంవత్సరం 5జీ స్పెక్టం÷-ర వేలం లక్ష 50 వేలకు వేలం వేశారని విమర్శించారు. దేశంలో ప్రతి కంపెనీలను అదాని, అంబానీలకు అప్పజెప్పుతున్నారన్నారు.

# రాష్ట్రానికి మూడ్రోజులు భారీ వర్ష సూచన

### వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ



**హైదరాబాద్, అగస్టు 26 (సమ సమాజం):** రాష్ట్రానికి భారీ వర్ష సూచన ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో 27, 28, 29 తేదీల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. రాగల మూడు రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా దక్షిణ, సెంట్రల్ జిల్లాలను వాతావరణ శాఖ అలర్ట్ చేసింది. ద్రోణి ప్రభావంతో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. చాలా చోట్ల భిన్న వాతావరణం కొనసాగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై వర్ష ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు నమోదవుతున్నా.. రానున్న రోజుల్లో రాయలసీమ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు నమోదవుతాయని

# వ్యవసాయాంలో ఇక నానో యూరియా వినియోగం

### ఎరువుల సంచుల తరలింపు ప్రక్రియ సులభతరం ● రైతులకు అవగాహన కల్పించిన మంత్రి నిరంజన్ రెడ్డి



**రంగారెడ్డి, అగస్టు 26 (సమ సమాజం):** ప్రపంచ వ్యవసాయానికి నానో యూరియా ఆదర్శమని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. 11 వేల మంది రైతుల పొలాల్లో నానో యూరియాను ప్రయోగించి.. ఫలితాలు పరిశీలించిన తర్వాత మార్కెట్ లోకి విడుదల చేశామని తెలిపారు. తొలిసారి యూరియాను ద్రవ రూపంలో నానో టెక్నాలజీలో అందుబాటులోకి తీసుకొచ్చామని, దీని వల్ల ఎరువుల సంచులను తరలించే పెద్ద పక్రియను సులభతరం చేశామన్నారు. దేశంలో పంటల ఉత్పాదకత పెంచేందుకు ఆధునిక వంగడాలు, రసాయనిక ఎరువుల వాడకం మొదలైందన్నారు. దేశ జనాభా ఆహార అవసరాలను తీర్చేందుకు నూతన పద్ధతులను అనుసరించాలని, భూమికి అవసరమైన పోషకాలు ఏమిటి..? ఎంత వాడాలి..? అన్నదానిపై రైతులకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో వ్యవసాయంలో ఇఫ్కో నానో యూరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు, రైతు బంధు సభ్యులు, సహకార సంఘాలు, ఆగ్రో సేవా కేంద్రాలు, డీలర్స్ కు ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, రైతులు హాజరయ్యారు. దేశంలో వినియోగించే 70 శాతం యూరియా విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చెప్పారు. అత్యధిక ఎరువులు, యూరియా వాడకం కారణంగా చెరువులు, కుంటలు, భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి అనేక దుష్పరిణా మాలను అరికట్టి.. రైతాంగానికి మేలు చేయాలన్న ఉద్దేశంతో తెలంగాణలో నానో యూరియాను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. వివిధ రాష్ట్రాలతో పాటు తెలంగాణలోనూ యూరియాను మోతాదుకు మించి వాడుతున్నారని, ఈ నేపథ్యంలోనే నానో యూరియా వైపు రైతులను మళ్లించాలని నిర్ణయించామని చెప్పారు. నానో యూరియా వాడకం వల్ల మొక్కలకు పత్రహరితం ఎక్కువగా అంది...పంట వేగంగా ఎదుగుతుందని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వివరించారు. యూరియా గడ్డకట్టడం, రవాణా ఖర్చులు అధిగమించడం, గోదాముల్లో నిల్వ ఇబ్బందులు, విదేశీ దిగుమతులు తగ్గించుకోవచ్చని చెప్పారు. 500 మిల్లీ లీటర్ల నానో యూరియా ఒక యూరియా బస్తాతో సమానం అన్నారు. యూరియా కేవలం 30 నుండి 50 శాతం మాత్రమే మొక్కకు ఉపయోగపడుతుందని, నానో యూరియా మాత్రం 80 శాతం వరకు పని చేసి మొక్క ఎదుగుదలకు చాలా తోడ్పడుతుందని తెలిపారు. తెలంగాణ వ్యవసాయం దేశానికి ఆదర్శం అన్నారు. నానో యూరియా వాడకంతో రాష్ట్రం మరోసారి దేశానికి దిక్సూచిలా నిలబడాలని కోరారు.

# బాన్సువాడ అభివృద్ధి సృష్టికర్త పోచారం

### బ్రిజ్జి ప్రారంభంలో మంత్రి వేముల



**కామారెడ్డి, అగస్టు 26 (సమ సమాజం):** స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ అభివృద్ధి సృష్టికర్త అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బీర్కూరు మండల కేంద్రం సమీపంలోని మంజీర నదిపై రూ. 48.50 కోట్లతో నూతనంగా నిర్మించిన హైలెవల్ వంతెనను స్పీకర్ పోచారంతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం బీర్కూరు మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ..స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభవృద్ధిలో దేశంలోనే నెంబర్ వన్ గా ఉందని మంత్రి అన్నారు. మోదీ మాటలు తప్ప దేశాభివృద్ధికి చేసింది ఏమీ లేదని విమర్శించారు. బీజేపీలో చేరకుంటే ఈడీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని, బీజేపీలో చేరితే అన్ని కేసులు మాఫీ అవుతున్నాయని విమర్శించారు. ఎమ్మెల్సీ కవితపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, బీజేపీ అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. వారి దుర్మార్గాలను కచ్చితంగా ప్రజల పక్షాన ప్రశ్నిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, ఆర్డీవో రాజా గౌడ్ పాల్గొన్నారు.

# వరంగల్ సభకు వస్తున్న సునీల్ బన్సల్



**హైదరాబాద్, అగస్టు 26 (సమ సమాజం):** బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కొత్త ఇంఛార్జ్ సునీల్ బన్సల్ తొలిసారి తెలంగాణకు రానున్నారు. రాత్రి 7 గంటలకు ఆయన శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి నేరుగా హనుమకొండకు వెళ్తారు. అనంతరం శనివారం ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న సభాస్థలికి వెళ్లి ఏర్పాట్లను పరిశీలించనున్నారు. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జిగా సునీల్ బన్సల్ ఇటీవలే నియమితులయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆ వెంటనే తెలంగాణతో పాటు పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కూడా బాధ్యతలు అప్పగించారు.

# వరంగల్‌లో సిటీలో నిషేధాజ్ఞలు

### ఉత్తర్వులు జారీచేసిన కమిషనర్

**వరంగల్, అగస్టు 26 (సమ సమాజం):** వరంగల్ కమిషనరేట్ పరిధిలో '30 సిటీ పోలీస్ యాక్ట్' ను అమలు చేస్తూ నగర పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి భద్రతల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. పోలీసు ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఈ నెల 31 వరకు అమల్లో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. సెక్షన్ 30 ప్రకారం నగరంలో పోలీసులు ఆంక్షలు విధించవచ్చు. ఈ సెక్షన్ అమల్లో ఉన్న సమయంలో శాంతిభద్రతలను పరిగణలోకి తీసుకుని బహిరంగ సభలు. ర్యాలీలకు అనుమతి ఇచ్చే అధికారం పోలీసులకు ఉంటుంది. ఇందులో భాగంగా పోలీసు ఉన్నతాధికారులు తమ పరిధిలోని కొన్ని నిర్దిష్ట ప్రదేశాల్లో సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకుండా కట్టడి చేయవచ్చు. ఆ కార్యక్రమాలు ఏయే ప్రాంతాల వరకు పరిమితం కావాలన్న దానిపైనా రూట్ మ్యాప్ విడుదల చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. సభలు, సమావేశాలు, ర్యాలీల వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించిన సందర్భాల్లోనే సెక్షన్ 30ని పోలీసులు ప్రయోగిస్తారు. నిషేధాజ్ఞలున్న ప్రాంతాల్లో డీజే సౌండ్స్ తో ఊరేగింపులపైనా బ్యాన్ ఉంటుంది. వీటిని ఉల్లంఘించే వారిపై మెట్రోపాలిటన్ సిటీ పోలీస్ యాక్ట్ లోని సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు.

# అమిత్ షాతో ఎన్టీఆర్ భేటీ

### టిడిపి నేతల్లో మొదలైన వణుకు

**రాజమండ్రి, అగస్టు 26 (సమ సమాజం):** కేంద్రమంత్రి అమిత్ షాతో జూనియర్ ఎన్టీఆర్ భేటీ తరువాత టీడీపీ అధినేత చంద్రబాబులో వణుకు మొదలైందని ఏపీ పర్యాటక శాఖ మంత్రి రోజా ఆరోపించారు. పశ్చిమగోదావరిలోని రాజమండ్రిలో ఇవాళ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మీడియాతో మాట్లాడారు. ఏపీ సీఎం రాష్ట్రంలో చేపట్టే కొత్త కార్యక్రమాలను చూ సి తట్టుకోలేక వాటిని భగ్నం చేసేందుకు ఏదో ఒక నాటకం ఆడుతున్నారని విమర్శించారు. ఫేక్ వీడియోతో ప్రభుత్వంపై , వైసీపీ నాయకులపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు కుప్పంలో వైసీపీ దాడులకు పాల్పడిందని కొత్త డ్రామా ఆడుతున్నారదని అన్నారు. కుప్పం నియోజక వర్గంలో చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదని, అతని పతనం తప్పదని పేర్కొన్నారు.

# సీరియల్ కిల్లర్‌గా మారిన బిజెపి

### నిప్పులు చెరిగిన ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రివాల్



**న్యూఢిల్లీ, అగస్టు 26 (సమ సమాజం):** దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రతిపక్షంలో ఉన్నా అక్కడి ప్రభుత్వాలను కూలుస్తూ అధికారం లాక్కుంటున్న భారతీయ జనతాపార్టీపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ నిప్పులు చెరిగారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సెషన్‌లో మాట్లాడిన ఆయన.. భారతీయ జనతాపార్టీని ప్రభుత్వాలను హత్య చేసే సీరియల్ కిల్లర్‌గా అభివర్ణించారు. భారతీయ జనతాపార్టీ దేశంలో ఇప్పటికే ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన చాలా ప్రభుత్వాలను కూలదోసింది. అక్రమంగా అధికారాన్ని చేజిక్కించుకుంది. ఇప్పుడు ఆ పార్టీ కన్ను ఢిల్లీ ప్రభుత్వంపై పడింది. ప్రభుత్వాలను హత్యచేసే సీరియల్ కిల్లర్ బీజేపీ. ఎందుకంటే ఏ రాష్ట్రంలోనైనా ఆ పార్టీ ప్రభుత్వాలను కూల్చే తీరు ఒకేవిధంగా ఉన్నది అని ఢిల్లీ అసెంబ్లీ సాక్షిగా కేజ్రివాల్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలను కూల్చడమే లక్ష్యంగా బీజేపీ చేపట్టిన ఆపరేషన్ లోటస్‌పై చర్చించేందుకు ఇవాళ ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా ప్రసంగించిన కేజ్రివాల్ బీజేపీపై మండిపడ్డారు. బీజేపీ ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 277 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిందని చెప్పారు. ఇంత డబ్బు బీజేపీకి ఎక్కడిదని ప్రశ్నించారు. ఆప్ నుంచి 40 మంది ఎమ్మెల్యేలను కొనేందుకు బీజేపీ ఎ÷–లాన్ చేసిందని, ఒక్కొక్కరికి రూ.20 కోట్లు ఇవ్వడానికి ఆశ చూపిందని ఆయన ఆరోపించారు. ప్రజలపై పన్నులు వసూలు చేసి వచ్చిన సొమ్మును ఎమ్మెల్యేల కొనుగోలుకు వినియోగిస్తున్నారని, కోటీశ్వరులైన బీజేపీ మిత్రులకు రుణాలు మాఫీ చేస్తున్నారని కేజ్రివాల్ విమర్శించారు.

# మూడు నెలల్లో కలెక్టరేట్ నిర్మాణం పూర్తి

### పనులను పర్యవేక్షించిన మంత్రి ఇంద్ర




**నిర్మల్, అగస్టు 26 (సమ సమాజం):** నిర్మల్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి మూడు నెలల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ సముదాయాన్ని పరిశీలించారు. కలెక్టర్ ముశ్రఫ్ అలీ ఫారూఖీ, ఇతర అధికారులు, గుత్తేదారులతో కలిసి నూతన కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో మంత్రి కలియతిరిగారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ల చాంబర్లు, మీటింగ్ హాల్స్, ప్రభుత్వ శాఖల కార్యాలయాలను పరిశీలించారు. అనంతరం భవనం ఆవరణలో జరుగుతున్న సుందరీకరణ, గా÷–డ్గ÷నింగ్, అప్రోచ్ రోడ్డు, తదితర పనులపై ఆరా తీశారు. నిర్మాణ ప్రగతిపై అక్కడే సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భవన నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# 29న పెద్దపల్లికి వస్తున్న సిఎం కెసిఆర్

### ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి గంగుల



**పెద్దపల్లి, అగస్టు 26 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ పెద్దపల్లి జిల్లా పర్యటన కోసం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఈ నెల 29న కలెక్టరేట్‌ను ప్రారంబించనున్నారు. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనే బహిరంగ సభా స్థలిని శుక్రవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 29న ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయాల సముదాయం, టీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం లక్ష మందితో నిర్వహించే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి సభ కోసం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, సుంకె రవి శంకర్, రాకేష్, బాలమల్లు, గ్రంథాలయ చైర్మన్స్ రఘువీర్‌సింగ్, రవీందర్ రెడ్డి, హరి శంకర్, సూరి పాల్గొన్నారు.

# అమెరికాలో జాతి వివక్ష దాడి

### భారతీయ మహిళపై నోరు పారేసుకున్న మెక్సికన్

**వాషింగ్టన్, అగస్టు 26 (సమ సమాజం):** అమెరికాలోని టెక్సాస్‌లో ఉన్న డెల్లాస్‌లో భారతీయ మహిళలపై జాతివివక్ష దాడి జరిగింది. మెక్సికన్‌కు చెందిన మహిళ ఓ పార్కింక్ లాట్‌లో భారతీయ మహిళలపై అటాక్ చేసింది. బూతులు మాట్లాడిన ఆ మెక్సికన్ మహిళ .. ఇండియాకు వెళ్లిపోవాలంటూ భారతీయ మహిళల్ని తిట్టింది. ఇండియన్లను ద్వేషిస్తాని, బెటర్ లైఫ్ కోసమే భారతీయులు అమెరికా వస్తుంటారని ఆమె అన్నది. భారతీయులపై చేయి చేసుకున్న ఆ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఆ మెక్సికన్ మహిళను ఎస్మరాల్డో ఉప్టన్‌గా గుర్తించారు. దాడికి సంబంధించిన వీడియో అమెరికాలోని ఇండియన్ కమ్యూనిటీలో వైరల్ అయ్యింది. తాను అమెరికాలో పుట్టినట్లు చెప్పిన ఆ మెక్సికన్ మహిళ చాలా దురుసుగా ప్రవర్తించింది. నేను ఎక్కడకు వెళ్లినా అక్కడ ఇండియన్లు కనిపిస్తుంటారని, ఒకవేళ ఇండియాలో లైఫ్ బాగా ఉంటే అప్పుడు మీరు ఇక్కడకి ఎందుకు వచ్చినట్లు ఆమె అరించింది.

# ప్రతిపేదవాడికి న్యాయం అందించడమే లక్ష్యం కావాలి



- సీజేఐగా కర్తవ్య నిర్వహణలో శక్తివంచన లేకుండా కృషి
- కేసుల పరిష్కారంలో కొత్త ఒరవడి తెచ్చా
- ఇప్పటికీ కోట్లాది మంది అణగగారిన వర్గాలు న్యాయం కోసం చూపు
- ప్రతి తీర్పులోనూ ప్రజల మనసు గెలిచేందుకు ప్రయత్నించా
- బార్ అసోసియేషన్ వీడ్కోలు సభలో జస్టిస్ ఎన్‌వి రమణ
- ఘనంగా సన్మానించిన సుప్రీం బార్ అసోసియేషన్
- కాబోయే సిజె ఉదయ్ ఉమేశ్ లలిత్ సహా పలువురి ప్రశంసలు
- పదవీ విరమణ చేసిన జస్టిస్ ఎన్‌వి రమణ
- 12 ఏళ్ల వయసులో కరెంట్ అంటే ఏమిటో చూశా
- అప్పుడే ఎబిసిడిలు నేర్చుకోవడం మొదలు పెట్టా
- జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా
- ఎమర్జెన్సీలో నేనూ ఇబ్బందులు పడ్డాను
- లాయర్‌గా కెరీర్‌లో సవాళ్లు ఎదుర్కొన్నా
- వీడ్కోలు సభలో తన గతాన్ని జ్ఞాపకం చేసుకున్న జస్టిస్ రమణ

**న్యూఢిల్లీ, అగస్టు 26 (సమ సమాజం):** ప్రతిపేదవాడికి న్యాయం అందించడమే న్యాయమూర్తి ప్రధాన లక్ష్యం కావాలని చీఫ్ జస్టిస్ ఎన్‌వి రమణ అభిప్రాయపడ్డారు. సత్యమేవ జయతే అనేది తాను నమ్మే సిద్ధాంతమని పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలో అనేక సవాళ్లు ఎదుర్కొని నిలబడ్డానని వివరించారు. జస్టిస్ రమణ పదవీ విరమణ సందర్భంగా సుప్రీంకోర్టు బార్ ఆసోసియేషన్ ఆయనను శుక్రవారం ఘనంగా సన్మానించింది. మరోవైపు జస్టిస్ రమణపై న్యాయవాదులు, తదుపరి సీజేఐ ఉదయ్ ఉమేశ్ లలిత్ సైతం ప్రశంసలు కురిపించారు.ఈ సందర్భంగా మాట్లాడిన జస్టిస్ రమణ సీజేఐగా తన కర్తవ్య నిర్వహణలో శక్తివంచన లేకుండా కృషి చేసినట్లు



పేర్కొన్నారు. కేసుల పరిష్కారంలో కొత్త ఒరవడి తెచ్చామన్న ఆయన, మౌలిక వసతుల కల్పనకు.. తన వంతు కృషి చేసినట్లు వివరించారు. ప్రతి తీర్పులోనూ ప్రజల మనసు గెలిచేందుకు ప్రయత్నించానని తెలిపారు. చివరిశ్వాస వరకు రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 'భారత న్యాయవ్యవస్థ సాధారణ ప్రజలకు ఎంతో దూరంలో నిలిచింది. ఇప్పటికీ కోట్ల మంది అణగారిన వర్గాల ప్రజలకు న్యాయ సహాయం అవసరం ఉంది. అవసరమైనప్పుడు న్యాయ వ్యవస్థను ఆశ్రయించ డానికి ఇంకా వారు జంకుతూనే ఉన్నారు. న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ మీడియాలో తగిన ప్రచారాన్ని పొందలేదని నాకు అనుభవపూర్వకంగా అర్థమైంది. కోర్టులు, రాజ్యాంగం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేదు. ప్రజలను కోర్టులకు చేరువ చేయడం నా రాజ్యాంగ విధి అని భావించాను. న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు, విశ్వాసం కల్పించేందుకు అనేక సదస్సులు నిర్వహించాం. నేను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు, ప్రజలను కలిసినప్పుడు వారు న్యాయ పరిభాషలో మాట్లాడడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. న్యాయాన్ని అందించే వ్యవస్థకు.. కక్షిదారుడు, న్యాయాన్ని అర్థించే వాడే అత్యంత ముఖ్యమైన అంశం. కానీ మన న్యాయవ్యవస్థ, ప్రొసీడింగ్స్ ఇంకా ఆంగ్లేయులనాటి విధానాలనే అవలంబిస్తోంది. అది మన ప్రజల అవసరాలకు అనుగుణంగా లేదు. మన న్యాయవ్యవస్థను భారతీక రించడం అత్యవసరం. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా న్యాయపాలన జరగాలి. వేగంగా న్యాయం అందించే దిశలో ఆధునిక మౌలికవసతుల కల్పనను ముందుకు తీసుకెళ్లాలని జస్టిస్ ఎన్‌వీ రమణ అన్నారు. అంతకుముందు జస్టిస్ ఎన్‌వీ రమణ పనితీరుపై తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు లలిత్, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు ప్రశంసలు కురిపించారు. జస్టిస్ రమణ ఇచ్చిన తీర్పులన్నీ సామాన్యులకు కూడా అర్థమయ్యే విధంగా ఉంటాయని కొనియాడారు. దేశంలోని హైకోర్టులు, ట్రైబ్యునళ్లలో.. మూడోవంతు నియామకాలు జస్టిస్ రమణ నేతృత్వంలోని కొలీజియం చేపట్టినవేనని ప్రశంసించారు. దేశంలోని న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జస్టిస్ రమణ ఎంతో కృషి చేశారని వివరించారు.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్‌వీ రమణ ఎన్నో చారిత్రక తీర్పులను వెలువరించారని న్యాయమూర్తులు, న్యాయవాదులు కొనియాడారు. కరోనా సంక్షోభంలో కూడా ఆయన సాంకేతికతను వినియోగించుకుని పనిచేసిన తీరు అనితర సాధ్యమని చెప్పారు. ఎన్నో సున్నితమైన రాజ్యాంగ అంశాలను వివాదాలు లేకుండా పరిష్కరించిన ఘనత జస్టిస్ రమణ సొంతమని వివరించారు. జస్టిస్ రమణ పదవీకాలం దేశ న్యాయవ్యవస్థకు సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు.దేశ విదేశాల్లో దేశ న్యాయవ్యవస్థకు సమున్నత గౌరవం లభించిందని ప్రజల కోణంలో భారత న్యాయవ్యవస్థ పనిచేస్తుందనే విషయం ప్రస్ఫుటమైందని బార్ అసోసియేషన్ కొనియాడింది. రాజ్యాంగ స్ఫూర్తి, పౌరహక్కుల రక్షణలో కొత్త అధ్యాయం సృష్టించారని ప్రశంసించింది. రాజకీయ పార్టీల ఉచిత హామీలపై కీలకమైన చర్చ జరిగే విధంగా చేయడంలో జస్టిస్ రమణ విజయం సాధించారని తెలిపింది. బార్ అసోసియేషన్లకు




జస్టిస్ రమణ ఇచ్చిన గౌరవం ఎప్పటికీ మరచిపోలేమన్న న్యాయవాదులు.. జడ్జిలపట్ల జస్టిస్ రమణ తీసుకున్న శ్రద్ధ.. గతం లో చూడలే దన్నారు. జడ్జిల నియా మకాలు, మౌలిక సదుపాయాల కల్పనలో జస్టిస్ రమణ ఎంతో కృషిచేశారని చెప్పారు. సామాన్యుడికి అర్థమయ్యే విధంగా జస్టిస్ రమణ ఇచ్చిన తీర్పులు.. అందరికీ ఆదర్శనీయమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కొనియాడారు. న్యాయాధికారిగా మూడు విషయాలు చెప్పదలుకున్నా. దేశ న్యాయవ్యవస్థకు జస్టిస్ ఎన్వీ రమణ చేసిన సేవలు అపారం. మొదటిది వేర్వేరు హైకోర్టులు, ట్రిబ్యునల్స్‌లో వేగంగా నియామకాలు చేపట్టారు. ప్రస్తుతం దేశంలోని మొత్తం న్యాయమూర్తుల్లో మూడో వంతు న్యాయమూర్తులను ప్రస్తుత కొలీజియమే నియమించింది. రెండోది ఎప్పుడూ మరిచిపోలేం. దేశంలోని న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఆయన పడిన తపనను మనం ఎప్పటికీ మరవలేం. ఇప్పటివరకు తీర్పుల విషయానికొస్తే ప్రతి తీర్పులో నేను ఒకటి గమనించాను. న్యాయాధికారి లేదా న్యాయవాదిగా కాదు పౌరునిగా చెబుతున్నాను. జస్టిస్ ఎన్.వి. రమణ ఇచ్చిన తీర్పులు సాధారణ పౌరులు అర్థం చేసుకునేలా ఉన్నాయని తుషార్ మెహతా అన్నారు. జనరల్ జస్టిస్ ఎన్వీ రమణకు మాతృభాషపై మమకారం అద్భుతమని చెప్పిన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్.. పదవీ విరమణ తర్వాత తెలుగులోనే పుస్తకాలు రాస్తానని చెప్పినట్టు గుర్తు చేసుకున్నారు. జస్టిస్ రమణ మేధస్సు, సామర్థ్యం, వ్యక్తిత్వాన్ని చూస్తే రాజకీయాల్లోకి వెళ్లి ఉంటే అత్యున్నత పదవిని అదిష్టించేవారని వికాస్‌సింగ్ వ్యాఖ్యానించారు. న్యాయవాద వృత్తిలో తన ప్రస్థానం గురించి వివరించారు. తనకు, తన కుటుంబానికి ఆశీర్వచనాలు అందించేందుకు ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉంటే... తన జీవిత ప్రయాణం కృష్ణా జిల్లాలోని పొన్నవరం అనే మారుమూల గ్రామంలో మొదలైందని ఎన్వీ రమణ గుర్తు చేసుకున్నారు. మా ఊరిలో విద్యుత్ సౌకర్యం, రోడ్డు సౌకర్యం, కనీస వసతులు ఉండేవి కావు. తొలిసారి నేను మా ఊళ్లో కరెంటును 12 ఏళ్ల వయసులో చూశాను. సరిగ్గా అదే ఏడాది నేను మొదటిసారి ఇంగ్లిష్ ఏబీసీడీలను నేర్చుకున్నాను అని బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జీవితంలో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఎదురైనా ధైర్యంగా నిలబడాలనే పాఠాన్ని తనకు గురువులు, తల్లిదండ్రులు నేర్పించారన్నారు. జీవిత అనుభవాలు కూడా తనకు అదే విషయాన్ని నేర్పాయని పేర్కొన్నారు. తొలితరం లాయర్ గా నేను కెరీర్ ను ప్రారంభించినప్పుడు అడుగడుగునా సవాళ్లు ఎదురయ్యాయి. వాటిని ఓపికతో అధిగమించాను. విజయానికి షార్ట్ కట్ లేదని గుర్తించాను. కష్టపడటం ఒక్కటే మార్గమని తెలుసుకున్నాను అని ఎన్వీ రమణ వివరించారు. నేను 17 ఏళ్ల వయసులోనే 10వేల మంది కార్మికులు సభ్యులుగా ఉన్న ట్రేడ్ యూనియన్ ను ముందుండి నడిపాను . అదే సమయంలో విద్యార్థులు, ఉద్యోగులు, రైతు సంఘాల తరఫున పోరాడాను అని చెప్పారు. ఎమర్జెన్సీ సమయంలో ఇబ్బందిపడిన ఎంతోమందిలో నేను కూడా ఒకణ్ని. ఆ సమయంలో ఒక విద్యా సంవత్సరాన్ని నష్టపోయాను. ఒంటరిగా మిగిలిన సందర్భాల్లో.. ఎవరితోనూ ఏమీ చెప్పుకోలేని పరిస్థితుల్లో.. ఎలా మసులుకోవాలి ? అనేది నాకు ఎమర్జెన్సీ సమయంలో తెలిసొచ్చిందని ఆయన తెలిపారు. న్యాయవాదిగా ఉన్న సమయంలో ఎన్నో సందర్భాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తరఫున వివిధ కోర్టుల్లో వాదనలు వినిపించాను. 'మనిషి జీవన సంఘర్షణ క్రమంలో ఆశావాదం, ఆత్మ విశ్వాసం రెండూ అవసరం. నేను దేవుడిపై విశ్వసిస్తాను. వివిధ కోర్టుల్లో జడ్జిగా పనిచేసిన సమయాల్లో మనసు, మెదడు రెండింటిని నా పదవికి అంకితం చేశాను. వాటిపై పూర్తి దృష్టిపెట్టి నిబద్ధతతో పనిచేశాను అని ఎన్వీ రమణ తన వీడ్కోలు ప్రసంగంలో తెలిపారు.




# చలన చిత్రం



## నిరాశ పరిచేలా లైగర్ వసూళ్లు

**రెండోరోజునుంచే ప్రేక్షకుల్లో అసహనం**

యంగ్ హీరో విజయ్ దేవరకొండ ,డైరెక్టర్ పూరీ జగన్నాధ్ కాంబినేషన్ లో తెరకెక్కిన 'లైగర్' మూవీ గురువారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. భారీ అంచనాల నడుమ వచ్చిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ సినిమా.. ప్రేక్షకులను ఆకర్షించలేకపోయింది. తొలి ఆట నుంచే డిజాస్టర్ అనే టాక్ రావడంతో రెండో రోజు ఆక్యుపెన్సీ తక్కువగా ఉంది. దీన్ని బట్టి ఫస్ట్ వీకెండ్ లో ఆశించిన మేర బాక్సాఫీస్ కలెక్షన్స్ ఉండకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 'లైగర్' చిత్రానికి యుఎస్ఏ ప్రీమియర్స్ నుంచే నెగెటివ్ టాక్ వచ్చింది. రివ్యూలు కూడా ఆశాజనకంగా లేవు. తెలుగులోనే కాకుండా మిగతా భాషల్లోనూ విజయ్ సినిమా పరిస్థితి అలానే ఉంది. బాలీవుడ్ క్రిటిక్స్ ఈ సినిమాని ఔట్ డేటెడ్ కంటెంట్ అని తేల్చేశారు. ఈ లైగర్ ఏమాత్రం గర్జించలేదు అని పేర్కొన్నారు. అయితే 'లైగర్' మేకర్స్ మాత్రం ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లో కలిపి మొదటి రోజున రూ. **33.12** కోట్ల గ్రాస్ వసూలు చేసిందని పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని బ్లాక్ బస్టర్ గా పరిగణిస్తున్నారు.లైగర్' పబ్లిక్ టాక్ మాత్రం దీనికి పూర్తి భిన్నంగా ఉంది. పేలవమైన కంటెంట్ తో ఏమాత్రం ఎమోషనల్ కనెక్షన్ లేని ఈ చిత్రానికి భారీ కలెక్షన్స్ ఆశించడం సమంజసం కాదని అంటున్నారు. సినిమా చుట్టూ నెలకొన్న హైప్ కారణంగా ఫస్ట్ డే ఆ మాత్రం వసూళు ్ళ వచ్చాయి కానీ.. ప్రెజెంట్ ట్రెండ్ ని బట్టి చూస్తే రెండో రోజు నుంచి కష్టమేనని విశ్లేషిస్తు న్నారు. వాస్తవికతకు దగ్గరగా ఉన్న సినిమాలు మరియు అసాధారణమైన కంటెంట్ తో తీసిన చిత్రాలు మాత్రమే బాక్సాఫీస్ వద్ద పని చేస్తాయని ఇటీవల కొన్ని సినిమాలు నిరూపించాయి. మంచి కంటెంట్ లేకుండా ఎంతగా పబ్లిసిటీ చేసినా రెండో రోజు నుంచి జనాలను థియేటర్లలోకి తీసుకురావడం కష్టమని అర్థమవుతుంది. ఇప్పుడు 'లైగర్' కూడా ఆ విషయంలో విఫలమైందనే చెప్పాలి.



## హాలీవుడ్‌పై అల్లు అర్జున్ దృష్టి

దక్షిణాది హీరోల ప్రతిభకు దాసోహమై.. ఇప్పుడు హాలీవుడ్ ఇండస్ట్రీ కూడా ద్వారాలు తెరుస్తోంది. రీసెంట్‌గా తమిళ స్టార్ హీరో ధనుష్ 'ది గ్రేమేన్' అనే హాలీవుడ్ మూవీలో ఇండియన్ అసాసిన్‌గా నటించి మెప్పించాడు. అందులో అతడు కనిపించింది చాలా తక్కువే అయినా.. యాక్షన్ సీక్వెన్స్‌తో అభిమానుల్ని ఆకట్టుకున్నాడు. ఇప్పుడు ఈ లిస్ట్ లోకి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కూడా చేరనున్నట్టు టాక్. హాలీవుడ్ లోని ఓ సూపర్ హీరో ఫ్రాంచైజీలో బన్నీ హీరోగా నటిస్తున్నట్టు సమాచారం. కొద్దిరోజుల క్రితం అల్లు అర్జున్ న్యూయార్క్‌లో జరిగిన 40వ ఇండియాడే పెరేడ్ కు హాజరయిన సంగతి తెలిసిందే. బన్నీని అక్కడ గ్రాండ్ మార్షల్ గా ఆహ్వానించారు. న్యూయార్క్ మేయర్ తో కలిసి బన్నీ సెల్ఫీకూడా దిగాడు. న్యూయార్క్ విజిట్ సందర్బంగానే అల్లు అర్జున్ హాలీవుడ్ ఎంట్రీ ఖాయం చేసుకున్నాడన్న వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. న్యూయార్క్‌లో ఉండగానే అతడు హాలీవుడ్ లలో ఒక ప్రముఖ సూపర్ హీరో ఫ్రాంచైజీ డైరెక్టర్ ను కలుసుకున్నాడని తెలుస్తోంది. త్వరలోనే ఈ సూపర్ హీరో సినిమాను అధికారికంగా ప్రకటిస్తారట. ఈ వార్తల్లోని నిజానిజాలపై బన్నీ క్లారిటీ ఇస్తే బాగుంటుందని అభిమానులు భావిస్తున్నారు. 'పుష్ప' చిత్రంతో జాతీయ స్థాయిలోనూ.. ఆపై అంతర్జాతీయ స్థాయిలోనే బన్నీ పేరు మారుమోగి పోయింది. కట్ చేస్తే ఇప్పుడు అల్లు అర్జున్ పేరు పాన్ ఇండియా స్టాయిలో ఓ బ్రాండ్ అయిపోయింది. తాజాగా 'పుష్ప 2' చిత్రం గ్రాండ్‌గా లాంఛయింది. అతి త్వరలో రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభం కానుంది. దీని తర్వాత మరో రెండు చిత్రాలు కూడా లైన్‌లో ఉన్నాయి. అయితే వాటికన్నా ముందు హాలీవుడ్ మూవీని మొదలు పెడతాడా? లేక .. ముందు వాటి సంగతి చూసి అప్పుడు హాలీవుడ్ మూవీలో నటిస్తాడా అనేది ఇంకా తెలియదు. నిజంగా ఈ ప్రాజెక్ట్ గానీ సెట్ అయితే.. అల్లు అర్జున్‌కు ఇక తిరుగే ఉండదు. మరి ఈ వార్తలో క్లారిటీ రావాలంటే కొద్దిరోజులు ఆగాల్సిందే.




## దిఘోస్ట్ ట్రైలర్ లాంచ్‌లో మహేశ్ బాబు

**థాంక్స్ చెబుతూ నాగ్ ఆసక్తికర ట్వీట్**

'ది ఘోస్ట్' చిత్రం ట్రైలర్. నాగ్ హోప్స్ అన్నీ దీనిమీదే ఉన్నాయి. గురువారం సాయంత్రం విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. అక్టోబర్ 5న విడుదలకు సిద్ధం చేశారు. ఇదిలా ఉంటే.. 'ది ఘోస్ట్' చిత్రం ట్రైలర్ ను లాంఛ్ చేసిన మహేష్ బాబుకు థాంక్స్ చెబుతూ నాగ్ చేసిన ట్వీట్ ఆసక్తికర చర్చకు దారితీసింది. హే.. మహేశ్.. 29 ఏళ్ళ క్రితం మీ నాన్నగారు సూపర్ స్టార్ కృష్ణతో కలిసి 'వారసుడు' సినిమా చేయడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. మనం దాన్ని ఎందుకు సంపూర్ణం చేయకూడదు? 'ది ఘోస్ట్' ట్రైలర్ విడుదల చేసినందుకు ధన్యవాదాలు' అంటూ నాగార్జున ట్వీట్ చేశారు. అప్పుడు కృష్ణ తన సినిమాలో నటించారని, ఇప్పుడు నేను నీ సినిమాలో ఎందుకు నటించకూడదు? అనే అర్థాన్నిస్తూ ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే నాగార్జున ఈ విషయాన్ని యాథాలాపంగా అన్నారా? లేక ఈ ఇద్దరూ ఏదైనా సినిమాని ఎ÷-లాన్ చేస్తున్నారా అన్నది ఆసక్తికరం.త్రివిక్రమ్ సినిమాలో కానీ, రాజమౌళి సినిమాలో కానీ నాగార్జున అతిథి పాత్రలాంటిదేమైనా చేస్తున్నారా? అనే సందేహాన్ని ఆ ట్వీట్ రేకెత్తించింది. దానికి తోడు మహేశ్ 'సంపూర్ణ ఆనందంగా ఉంటుంది. ఎదురు చూడాల్సిన విషయం'. అని దానికి రిప్లై ఇవ్వడం ఆలోచించాల్సిన విషయమే.ఈ ఇద్దరూ ఏదో ప్లాన్ మీదే ఉన్నారని నెటిజెన్స్ ఊహించేసుకుంటున్నారు. 'మన్మథుడు, సంతోషం' లాంటి నాగ్ చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. నాగార్జున నటించిన 'రాజన్న' చిత్రానికి రాజమౌళి యాక్షన్ సీన్స్ డైరెక్ట్ చేశారు. ఈ రెండు సినిమాలతోనూ ఆ ఇద్దరి దర్శకులతో నాగార్జునకు మంచి రిలేషన్స్ ఉన్నాయి. కాబట్టి.. మహేశ్ సినిమాలో నాగార్జున నటిస్తే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఆల్రెడీ వెంకీతో 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు' అనే మల్టీస్టారర్ చేసిన మహేశ్ కు మళ్ళీ అలాంటి చిత్రం మరోటి చేయడం పెద్ద విషయం కాదు.



## సింగరేణి నేపథ్యంలో దసరా సినిమా ఆకట్టుకునే మాస్ లుక్‌లో నాని

నేచురల్ స్టార్ నానీ తాజాగా నటిస్తున్న చిత్రం 'దసరా' తెలుగు,తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కాబోతోంది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 30వ తేదీన థియేటర్లలో విడుదల చేయనున్నట్టు తాజాగా మూవీ మేకర్స్ ప్రకటించారు. ఇంతకు ముందు విడుదలైన ఈ సినిమా టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చ్ 30న విడుదల చేస్తున్నట్టు ఓ ప్రత్యేక పోస్టర్ ద్వారా ప్రకటించారు. పెద్ద సిల్క్ స్మిత పోట్రైట్ ముందు నానీ కూర్చునే లుక్ ఆకట్టుకుంటోంది. పీరియాడికల్ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో ఒకప్పటి వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తున్నాడు దర్శకుడు. . శ్రీలక్ష్మి వెంకటేశ్వరా ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. మలయాళ బ్యూటీ కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తుండగా.. సముద్రఖని, పూర్ణ, ప్రకాశ్ రాజ్, రాజేంద్ర ప్రసాద్, రోషన్ మ్యాథ్యూ, సాయికుమార్, జరీనా వహాబ్ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తుండగా, సత్యన్ సూర్యన్ ఛాయా గ్రాహణం నిర్వహిస్తున్నాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in